International Journal of Academic Research
ISSN: 2348-7666; Vol.6, Issue-10, November, 2019
Impact Factor: 6.023 drtvramana@yahoo.co.in

# తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి నవలలు – స్త్రీ సమస్యలు

సయ్యద్ అఫ్రీన్ బేగం: 9908028835

తెలంగాణ గత మూడు దశాబ్దాల నుండి రచనలు చేస్తున్న రచయిత్రి తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి పేదలపట్ల, ముఖ్యంగా మధ్యతరగతి స్త్రీ సమస్యలను అనేక కోణాల్లో తన నవలల్లో వివరించారు. నవలా ప్రక్రియను ఒక అభిరుచితో కాకుండా ఒక దీక్షగా కొనసాగించారు 'సహృదయత, సేవాభావం, అభుద్యయ స్ఫూర్తి అనే పదాలకు నిలువెత్తు రూపం ఆమె నవలలు' స్త్రీల జీవితం దుర్భరమైనపుడు అణచివేత ఎక్కువైనపుడు ఇంక సమాజంలో జీవించలేము అన్న పరిస్థితుల్లో ఆమె స్త్రీ పాత్రలు చైతన్యవంతంగా మారతాయి. తద్వారా స్త్రీ జాతిని జాగృతపరచే ప్రయత్నం చేస్తాయి. ఎన్నో సామాజిక సవాళ్లకు సమాధానంగా స్త్రీ పాత్రలను తీర్చిదిద్దారు. మైత్రి కరార్‌లో మీనాబాయి ఏడు రోజులు నవలలో గౌసియాబేగం, సితార నవలలో వైదేహి, స్వప్నసౌధంలో వసుంధర వీలు నామాలో పరిమళ మొదలైన, స్త్రీ పాత్రలను ఉదాహరణగా చెప్పవచ్చు డబ్బు కోసం మనుషులు ఎంత హేయమైన పనైనా చేయగలరు అని నిరూపించి కనుమరుగైవుతున్న మానవ సంబంధాల అస్తవ్యస్థ స్థితిని చాటి చెప్పింది. మానవతా విలువలు నశించి పోతున్న నేటి సమాజానికి కాయకల్ప చికిత్స చేసారని పాఠకులు అభిప్రాయ పడ్డారు.

**ఏడు రోజులు**: ఏడు రోజులు నవలలో తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి గల్ఫ్ దేశాల నుండి అరబ్బు షేకులు పాత నగరాన్ని కేంద్రంగా చేసుకొని అందమైన అమ్మాయిల్ని కొనుగోలు చేసి సుఖాన్ని అనుభవించేవారని ఈ నేపథ్యంలో గౌసియా బేగం వారి కంబంధ హస్తాల నుండి విడిపించుకొని యువకులకు చిక్కడం వారి నుండి తప్పించుకొని అనేక కష్టాలు, సమస్యలను ఎదుర్కొని చివరకు ప్రియుడు భవానిశంకరాన్ని కలవడం ఇతివృత్తాన్ని తీసుకొని స్త్రీ సమస్యలను కళ్ళకు కట్టించారు.

భాగ్యనగర్ శివారులో వున్న మైసమ్మ గుడి ప్రాంతంలో ఇద్దరు యువతీ యువకులూ ప్రేమించుకుంటారు. ఆమె పేరు గౌసియాబేగం, అతని పేరు భవాని శంకర్ హిందూ ముస్లిం తేడాలు బాలస్వామి, సాయిబుల కారణంగా ఆ ప్రాంతంలో మత కలహాలు జరుగుతూ వుండేవి. డబ్బుకు ఆశపడి సాయిబు తన పెద్ద కుతూరు గౌసియాబేగంను మూడు లక్షల రూపాయలకు అరబ్బుషేకులకు అమ్మివేస్తాడు. పిట్టలరాజు అనేవాడు ఆ ప్రాంతానికి దాదాగా వ్యవహరించేవాడు. అతని పథకం ప్రకారం రెండు మతాల అండదండల కోసం బాలస్వామిని ఆసరాగా మలుచుకొని లక్షల రూపాయలతో కాంట్రాక్టు మాట్లాడుకున్నాడు. మానవతను మరిచిన బాలస్వామి తనకు తెలిసిన అబ్బాయిని ఉసిగొల్పి ముస్లిం అమ్మాయిని కావాలని టీజ్ చేయించాడు. ఆ గొడవల్లో ఆ

అబ్బాయి మరణించాడు. అమ్మాయి కూడ ఆ తరువాత మరణించింది. మరణించారు అని చెప్పేకంటే చంపబడ్డారు అని చెప్పడమే బాగుంటుంది. ఈ విధంగా మత విధ్వంసాలు సృష్టించి ఎప్పుడూ ఏదో గొడవ జరుగుతుండేది. కులమతాలు సమసితోయి అనుకుంటే అవి సమసిపోక రోజు రోజుకీ పేట్రేగిపోతున్నాయి. హిందువుల దేవాలయాలపై ముస్లింలు, ముస్లిందర్గాలపై హిందువులు దాడి చేసుకునే వారు. ఆ గొడవల్లోనే బాలస్వామి తమ్ముడు, సాయిబు అన్న కూడ చనిపోయారు.

అరబ్బు షేకు సాయిబుతో "పిల్లను నిఖా చేసుకొని తీసుకొని వెళ్ళిపోతాను అంతా సిద్ధం చేయి" అన్నాడు. ఆ మాటలు విన్న గౌసియాబేగం నిలువెత్తున వణికిపోయింది. వొద్దమ్మా.. నాకు జీవితం వొద్దు అని ఏడుస్తూ చెప్పింది. పట్టె మంచాలు, జరీచీరలు, పెద్ద పెద్ద గదులు పెద్ద బంగళా అన్నీ నీ సొంతమైపోతాయి అందుకే ఆనందంగా ఉండు అని ధైర్యం చెప్పే ప్రయత్నం చేసింది తల్లి ఖతీజాబీ పది నిమిషాల్లో ఆమెను ముస్తాబు చేశారు. ఆమెను ఆమె అందాన్ని చూస్తున్న అరబ్బు షేకు కళ్ళు ఆశగా మెరుస్తున్నాయి. ఇక ఉండలేక ఈ రాత్రికే నిఖా చేసుకుంటాను. నీ కూతుర్ని పంపించు అన్నాడు.

జరిగిన విషయాన్ని స్నేహితులకు భవానీ శంకర్ చెప్పాడు. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ఎవరు ముందుకు రాలేదు. పోలీస్‌స్టేషన్ కి వెళ్ళి రిపోర్టు ఇవ్వాలనుకున్నాడు ఇంతలో గోపాల్ అనే స్నేహితునికి సమస్యను చెప్పుకున్నాడు.

ఆ రోజు రాత్రి పన్నెండు గంటలకు సాయిబుకీ తండ్రిలాగ ఉన్న ఒక అరబ్బు షేకు వచ్చి బేగంని తీసుకొని పోయాడు. విమానంలో షేక్ ప్రక్కన కూర్చుని ప్రియుడు భవానీ శంకర్ గురించి ఏడుస్తూ ముంబాయి పెద్ద హొటల్లో షేకుతో పాటు వెళ్ళింది. అందమైన స్త్రీలను అనుభవించడం కోసం పనిగట్టుకొని గల్ఫ్ దేశాల నుండి షేకులు వస్తారని నెలలవారిగా తిష్ఠ వేస్తారని వాళ్ళకి కావాల్సినంత సుఖాన్ని అందిస్తూ దండిగా డబ్బు సంపాయించుకుంటున్నారని గౌసియాబేగంకు తెలియదు. ఆమె బాధపడకుండా ఎంతో ఆనందంగాకనిపించడంతో గది తలుపులు దగ్గరకు వేసుకున్నాడు షేక్. ఆమెను తన మీదకు లాక్కుని కోరలు చాచిన పాములా విరుచుపడ్డాడు. తన ప్రియుడు కూడ ఎప్పుడూ అలా చేయలేదని మా మధ్యన స్నేహబంధం లాంటి ప్రేమ కొనసాగిందని ఆవేదన పడింది.

అతని కబంధ హస్తాల నుండి విడిపించుకుంటూ పగిలిన గాజుముక్కను చేతిలోనికి తీసుకుంది. దాంతో షేకు విస్మయం చెంది జేబులోంచి పిస్టల్ బయటకు తీసి ఆమెకు గురిపెట్టాడు. ఆమె భయబడి గాజు ముక్కను టీపాయ్ పై పడేసింది. మళ్ళీ అకృత్యాన్ని పాల్పడగా సరిగ్గా అదే క్షణంలో మళ్ళీ గాజుముక్కను తీసుకొని వెనకా ముందు ఆలోచించకుండా అతడి కడుపులోకి

బలంగా పొడిచింది. అతడు రక్తపు మడుగులో గింజుకుంటున్న సమయంలో వేగంగా బయటకు వెళ్ళిపోయింది. అది గమనించిన కొందరు యువకులు ఆమెను వెంబడించి పోలీస్‌స్టేషకి తీసుకు వెళతామని బెదిరిస్తే జరిగిన హత్య గురించి వివరించింది. అదివిని అదిరిపడ్డ ఆ యువకులు ఆమెను నమ్మపలికి ఇంటికి తీసుకొని వెళ్ళాగా , వారి మాటలు విని వాళ్ళలో ఉన్న కామాన్ని గ్రహించి మోసపోయానని వారినుండి తప్పించుకుంటుంది.

హైదరాబాదు గౌసియాబేగం వీధిలో మళ్ళీ హిందూ, ముస్లింలు ఒకర్ని ఒకరు కొట్టుకోవడం, కత్తులతో పొడుసుకోవడం మొదలైయాయి. సాయిబుని హిందుల కుర్రాడు భవానీశంకరం అకారణంగా హత్య చేశాడు. అతని కుటుంబానికి దిక్కు ఎవరూ లేరు ఈ సంఘటన మతకలహాలకు దారితీసింది.

గౌసియాబేగం ఫాదర్‌ని కలిసి జరిగిదంతా వివరించి, తన ప్రియున్ని రప్పించండి. లేదా తననైన భవాణిశంకర్ దగ్గరకు పంపించమని కోరగా, ఫాదర్ ఇన్స్‌పెక్టర్‌కి గౌసిబేగం చేసిన హత్యగురించి వివరిస్తాడు.

అన్నీ అవరోధాలను అధిగమించి భవానీశంకర్ ముస్లిం యువకుడిలా వేషం ధరించి చెప్పున వచ్చి గౌసియా అని ఆమె చేతుల్ని పట్టుకున్నాడు. అతడి కళ్ళలోనూ నీళ్ళు ఆమె ప్రేమకు ప్రతీకలుగా మనం చూడవచ్చు. వారి అనురాగాన్ని చూసి కమలాకర్‌కు ఆశ్చర్యవేసింది. గౌసియాను ఈ పరిస్థితుల్లో నీ వెంట తీసుకువెళ్ళవద్దు నీవు మద్రాసు వెళ్ళి సయ్యద్ పాషాగా బతుకు నీవు ఆర్థికంగా ఎదిగి ప్రత్యేక స్థానాన్ని నిలుపుకో అపుడు నేనే స్వయంగా గౌసియాను అప్ప చెబుతాను అని కమలాకర్ అన్నాడు. భవానీ శంకర్ అతి జాగ్రత్తగా గౌసియాబేగంను ఆటో ఎక్కించాడు. ఆటోలోంచి వీడ్కోలుగా చేయి చూపింది గౌసియాబేగం. దీంతో నవల ముగుస్తుంది.

<u>స్వప్నసౌధం:</u> వసుంధర దీరేంద్రను ప్రియుడిగా ఊహించుకొంటు కలలు కంటుంది. అనుకోకుండా పని మనిషి మల్లేశంతో పెండ్లి జరుగుతుంది. పెండ్లి తరువాత కూడ భర్తను దూరం పెట్టి జమీందారు బిడ్డను దీరేంద్రనే కోరుకొంటుంది. అతడు మాత్రం ఆమెను అనుభవించి బ్లూఫిల్మ్ లు తీసి వ్యాపారం చెయ్యాలనుకొంటాడు. అది గమనించిన వసుంధర చీకటిలో రోకలిబండతో అతని తలపై కొడుతుంది కాని రక్తపు మడుగులో ఉన్నది తన భర్త అని తెలుసుకొని రోధిస్తుంది. ఈ ఇతివృత్తాన్ని తీసుకొని చైతన్యవంతంగా వసుంధర పాత్రను తీర్చిదిద్దారు.

వసుంధర కటిక పేదరికంలో పుట్టిన అమ్మాయి. ఆ గ్రామంలో జమీందారు దొరబాబు పెద్ద కుమారుడు దీరేంద్ర. అతడినే ప్రియుడిగా ఊహించుకొని కలలు కంటుంది. కాలేజీలో చదువుకుంటూ వారి ఇంటిలోనే పార్ట్ టైమ్ పని మనిషిగా పని చేస్తుంది. అనుకోని విధంగా వాళ్ళు పని వాళ్ళలో మల్లేశంతో వివాహం జరుగుతుంది. వివాహం అయిన తరువాత భర్తను దూరంగా పెట్టి దీరేంద్ర

కోసం తన ఊహ ప్రపంచంలో బతుకుతుంది.

పెళ్ళికి ముందు దొరబాబుని గాఢంగా ప్రేమించడం, పెళ్ళి తరువాత అతడు తనవాడుగా కాలేకపోవడం, ఆమె వ్యక్తిత్వాన్ని అతడు తప్పుగా అర్థం చేసుకున్నాడేమోనని వసుంధర కుమిలి పోతుంది. ఇటు పెళ్ళికి అటు ప్రేమకి మధ్య నలిగిన. ఆమె మూగ హృదయం స్వప్నసౌధం ఒక్కసారిగా కూలిపోయినట్లు అనిపించింది. దేవుడి గది శుభ్రం చేస్తుంటే అక్కడ ఒక ఉత్తరం కనిపిస్తుంది. ఆ ఉత్తరంలో "డాక్టరుగారూ రాజరికంలో పుట్టి పెరిగిన నాకు ఒక పేద అమ్మాయి మీద మనస్సు పడింది కాని మా పని వానితో ఆమెకు పెళ్లయింది. కోరుకున్న అమ్మాయిని ఫ్రెష్ గా అనుభవించాలని తపనపడ్డాను. అది జరగలేదు. ఆమె అందంగా వుంటుంది కాబట్టి కొన్నాళ్ళు అనుభవించి, సీక్రెట్‌గా కొనసాగిస్తున్న బ్లూ ఫిల్మ్ బిజినెస్ లో ఆమె అందాలని హైలైట్ గా పెట్టాలని అవసరమైతే వచ్చే బిజినెస్ పార్టనర్స్ కి ఆమెతో రాత్రుల్ని బుక్ చేయాలని అనుకొంటున్నాను. మీరు ఓకె అంటే నా వ్యాపారంలో మీకు ఒక భాగం కేటాయిస్తాను" అని పెదబాబు దీరేంద్ర వ్రాసిన ఉత్తరం చదివి రెక్కలు తెగిన పక్షిలా విలవిలలాడిపోయింది. బాగా తాగివచ్చి "మనిద్దరమే వున్నాం కమాన్ ప్రొసీడ్" అంటూ చప్పున చేయి పట్టుకున్నాడు. దాంతో వసుంధర ఇక్కడవద్దు రాత్రి పదకొండు గంటలకు మేము వున్న గదికి వచ్చేయండి అని చెప్పి వెళ్ళిపోయింది. గదికి రాగానే కూలబడిపోయింది. వసుంధర రోదిస్తూ బాబు గారు మల్లేశాన్ని బతికించండి మీ కాళ్ళు పట్టుకుంటాను అని అభ్యర్థించింది. అతడు ఫకాలున నవ్వి నీవు తవ్వుకున్న గోతిలో నువ్వే పడ్డావు ! స్టుపిడ్ అంటూ వెళ్ళిపోయాడు. అమాయకుడైన తన భర్త మరణం ఆమె గుండెను కాల్చివేసింది. ఆమె చైతన్యాన్ని మూగపరిచింది పెదబాబుని ప్రేమించింది కాని, అతడితో అక్రమ సుఖం కోసం ధైర్యం చేయలేదు. విలువల పరిధిలో నిలబడి ఆలోచించింది. కాని సమాజం ఆమెకు ఎప్పుడు విలువ ఇవ్వలేదు. ఇప్పుడు అమాయకుడైన భర్తను తొలగించుకొని ఆస్తిని చేజిక్కుంచు కొనుటకు మల్లేశాన్ని చంపించిందని అపవాదులని తట్టుకోలేక వెక్కి వెక్కి ఏడవ సాగింది. జర్నలిస్ట్ ప్రత్యూష ఆమెను ఓదారుస్తూ నీకు మంచే జరుకుతుందని ధైర్యంగా ఉండమని చెప్పగా లేదు నేను పెదబాబుని చంపేయాలి అని బిగ్గరగా అరుస్తుంది.

**సితార**: గొప్ప ధనవంతుడు అందగాడైన వరదరాజుల ఏకైక కుమారుడు పృధ్విని వైదేహి స్నేహితురాలు మాటలువిని ప్రేమిస్తుంది. అతని అంతరంగమేమిటో తెలుసుకోకుండా అతని సన్నిధిలో కష్టాలని కన్నీళ్ళని ఆకలిని మర్చిపోవచ్చాని పృధ్వి ప్రేమలో నిండా మునిగిన వైదేహికి తన పేదరికం చేదుగా కన్పిస్తుంది. తల్లిదండ్రులు దీన స్థితిని చూచి పృధ్వి భార్యగా తాను ఎప్పుడు మారుతానో అని ఆతృత పడేది. పృధ్వితో వైదేహి ప్రేమని అప్పుడే తెలుసుకున్న అనుపమ గుండె అగ్ని పర్వతమైంది. ఆమె

అందాన్ని పొగుడుతూ ఆమెను ఒడిలోనికి తీసుకొన్నాడు ప్రేమ, పెళ్ళి అనే పేరుతో పృధ్వి ఆమెను వంచించాడు నాలుగురు స్నేహితులతో ఆమెను రేప్ చేయించాడు.

ఆ సమయంలో తల్లిదండ్రులతో భాగ్యనగరానికి బయలుదేతుంది వైదేహి. ఆ తరువాత జగదీశ్వర్, రవివర్మ మాట్లాలునమ్మి మళ్ళీ మోసపోయింది. డబ్బులు లక్షలకు లక్షలు సంపాదించి చివరకు మాదక ద్రవ్యాల ఊబిలో మునిగిపోయింది. ఈ నాలుగు కుక్కలు ఆమెపైకి ఎగబడ్డారు. వారిని ఛేదించుకొని రాలేక మరణించింది. పేదరికపు ప్రతిరూపం తమ జీవితాల మీద పగబట్టి పంజా విసురుతున్న నేపథ్యంలో తలవంచడమే తప్ప దిక్కరించలేని అసహాయ స్థితితో బ్రతుకుల్లో అడుగడుగునా అశ్రువులను కార్చుతూ హుస్సేన్ సాగర్ తీరాన బుద్ధ భగవానుడి సాక్షిగా వైదేహి పార్థివదేహం జనం కంటపడింది. మానవతా విలువలు నశించి పోతూ రోజురోజుకీ కృశించి పోతున్న ఈ సమాజానికి కాయకల్ప చికిత్స చేయడంలో రచయిత పాత్ర అమోఘమైయింది. తమ రచనల ద్వారా మానవ సంబంధాల గురించి జీవన విలువల గురించి మానవతా ధోరణుల గురించి పరిపుష్యంగా తెలియజేయడంలో రచయిత్రి జాగురుకులు కావల్సిన సమయంలో నవలా నాయికను మరణింప చేయడం ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ రోజులలో ఆడది ప్రతి రంగంలో పురుషునితో పోటీపడి విజయం సాధిస్తుంటే ఆమెను మరణింపజేసి నవలను ముగించారు నేడు స్త్రీ జగతి జాగృతమై వ్యక్తిగతంగా స్త్రీ చైతన్యంతో ముందుకు వెళ్ళుతుంది. ఆ స్త్రీ చైతన్యంతో తన స్వేచ్ఛను హరించిన వారిపై విజయం సాధించినట్లు రాస్తే బాగుండేది.

ఈ నవల సినీతారల జీవితాలని పరోక్షంగా ప్రతిబింబించింది. ప్రసిద్ధ తెలంగాణ రచయిత్రి తంగెళ్ళ శ్రీదేవి రెడ్డి స్త్రీ జాతికి ఒక హెచ్చరికగా చెప్పినట్లు భావించాలి వైదేహి మరణాన్ని ముగింపుగా ఇవ్వడం వల్ల ఇది స్త్రీ బలహీతని ఎత్తి చూపినట్టవుతుందని పాఠకులు గ్రహించరు. సితార నవలను విద్యుల్లత మాసపత్రికకు అంకితమిచ్చారు.

<u>**మైత్రికరార్**</u>: గుజరాత్ రాష్ట్రంలో రాజ్ కోట్ నగరంలో “మైత్రి కరార్” అనే దురాచారం ఉండేది. ఈ దురాచారానికి బలి అయిన స్త్రీలు ఎంతో మంది ఉన్నారు. వారిలో మీరాబాయి ఈ దురాచారానికి బలి అయి అనేక కష్టాలు అనుభవించింది. ఈ నేపధ్యంతో మీరాబాయి కధతో మైత్రికరార్ దురాచారన్ని రూపుమాపడం వంటి ఇతివృత్తాన్ని తీసుకొని రచయిత్రి చక్కగా ఈ నవలను రాశారు.

రాజ్ కోట్ నగరంలో మీరాబాయి సతీష్ వాఘేలా భార్య భర్తలు మధ్య తరగతి చెందిన కుటుంబం. సతీష్‌వాఘేలా తన తండ్రి అంత్యక్రియల కోసం శేషుబాయి దగ్గర రెండు వేల రూపాయలు అప్పు తీసుకొంటాడు ఆరు నెలల్లో అప్పు తీరుస్తానని రెండు సంవత్సరాలు అయిన అప్పు తీర్చలేదు. ఇప్పటికి రేపు మాపు అని వాయిదా వేస్తూ వస్తున్నావు. మైత్రికరార్ ప్రకారం నీ భార్య మీరాబాయి

ఇప్పుడు నా మనిషి ఆమెను నేను ఏమైనా చేసుకుంటాను అని శేషుబాయి ఆమెను తీసుకొని పోయాడు. అది చూచి సతీష్ వాఘేలా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. భారతదేశం స్వాతంత్ర్య స్వర్ణోత్సవాలు పూర్తి చేసుకున్న అభివృద్ధి చెందుతున్న ఈ దేశంలో ఈ దురాచారం ఏమిటన్న ఆశ్చర్యం కలగకమానదు. ఇది ఏ సమాజమైనా సిగ్గుతో తలవంచుకోవాల్సిన విషయం. దేనికి ఈ నగరమంతా కట్టుబడి వుండాలి ఎవరు మాట్లాడకూడదు. ఒక వేళ తెగించి పోలీసు స్టేషనులో రిపోర్టు ఇచ్చిన వెంటనే ఆ పేట తగలబడిపోతుంది. ఈ పద్ధతి ప్రకారం శేషుబాయికి భర్త హెూదా లభించడం, అతడి వల్ల పిల్లలను వాళ్ళ బాధ్యతను చూసుకోవాలి. శేషుబాయి లేనప్పుడు అమ్మూ, మల్హోత్రా, మహంతి ఒకరి తర్వాత ఒకరు ఆమెను దారుణంగా అనుభవించేవారు.

డబ్బుకు ఆశపడి మీరాబాయిని పటేడితో పంపిస్తాడు.. పటాడి అనాధ అందుకు అతనిలో చిన్నప్పటి నుండి రాక్షసత్వం చోటు చేసుకుంది. కొంత వయస్సురాగానే దొంగతనాలు, దౌర్జన్యాలు చేసి బాగా ఆస్తిని సంపాదించి ఆ నగరంలో పేరుగడించాడు. పటేడి దగ్గర పని చేస్తున్న వాచ్ మన్ చెల్లెలు అప్సరను దారుణంగా అనుభవించాడు. మాకు చెప్పుకోడానికి ఎవ్వరూ లేరు అని మీరాబాయికి వాచ్ మన్ దూబే జరిగినదంతా చెప్పుతాడు. భర్త గురించి ఎదురు చూస్తూ చేసేది లేక పటాడి దగ్గరే నరకయాతనను అనుభివిస్తూ వుండేది.

మీరాబాయితో పాటు మరో అమ్మాయిని కూడ దుబాయి సేటులకు అమ్మి వేద్దామని రాధామనోహర్ చెప్పిన మాటలు వింటుంది. ఇక లాభం లేదని ఆమె తెగింపుకు వచ్చేసింది. దారుణంగా దగాపడుతున్న ఎందరో అమ్మాయిల కోసం ఆ రాక్షసుల్ని చంపేయాలి ఆ ప్రయత్నంలో తాను చనిపోయినా పర్వాలేదు అని నిర్ణయానికి వచ్చేసింది. తాగి కారు నడుపుతున్న పటౌడిని కత్తితో గొంతులోనే పొడిచింది. ఆలస్యం చేయకుండా కారులోంచి బయటకు దూకింది. నేరుగా పోలీస్ స్టేషన్ వెళ్ళే దారిలో అంతకు ముందు ఆమె సహాయం చేసిన విఠోభా కనబడడం జరిగిన కథ చెప్పడం నీవు చేసిన హత్య కారణంగా ఎందరి జీవితాల్లో వెలుగు ప్రసరించిందని చెప్పడం మైత్రికరార్ దురాచారాన్ని వెంటనే రూపుమాపాలని మహిళా సంఘాలు ఉద్యమించాయి. ఆ మహిళా సంఘాలు మీరాబాయిని ఎంతగానో ప్రశంసించాయి. చివరకు పిచ్చ ముదిరిన భర్తను కలుసుకోవడం ఆనందంతో నవల ముగుస్తుంది.

**వీలునామా:** ఈ నవల లుప్తమౌతున్న మానవ సంబంధాల అస్తవ్యస్థ స్థితిని చాటిచెప్పింది. ప్రేమ, ఆత్మీయత పుష్కలంగా ఉన్న మనిషి యొక్క ఆలోచనా సరళి ఎలా వుంటుందో పరిమళాదేవి పాత్రలో అణువణువునా రంగరించారు. స్వార్ధబుద్ధితో తన చుట్టూ చేరిన బంధువులు తన ఆస్తిమీద ఆశపడి తనమీద ప్రేమ చూపుతున్నారని తెలిసి కూడా వారిని మన్నించడం, చివరికి తన కొడుకుని,

కూతుర్ని బలి తీసుకుందని తెలిసి కూడా వరసకి కూతురైన శకుంతలకు తన 'ఆస్తిలో భాగం ఇవ్వాలా ? ఆమెని క్షమించాలా ? అయినా పిల్లలు తప్పు చెయ్యలేదుగా' అని ఆలోచింపచేయడం ద్వారా రచయిత్రి ఆ పాత్రను ఉన్నత శిఖరాగ్రాన నిలిపారు. డబ్బు కోసం ఎత్తుగడలు, కేవలం ఐదారు పాత్రల చుట్టే అల్లబడిన కథాగమనం, సాగదీసినట్లుగా నడిచిన సన్నివేశాలు, అన్ని కలిపి 'వీలునామా' నవలగా మారింది. మొత్తంమీద సమాజంలో క్రమంగా పెరుగుతున్న ధనపిపాసకు, కుతంత్రాలకు దర్పణం పట్టిందీ నవల. డబ్బుకోసం మనుషులు చేసే అఘాయిత్యాలను కళ్ళకు కట్టినట్లు తంగెళ్ళ శ్రీదేవిరెడ్డి తమ 'వీలునామా' నవలలో చూపించారు. నేటి సమాజపు రీతికి ఇది ఒక నిలువుటద్దమే.